జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం, జులై 22, 2026
పేజీలు:7

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు

# కఠిన చర్యలు

## మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్‌నగర్, జూలై 21( ప్రజా జ్యోతి బ్యూరో ):** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ దరావత్ జానకి పాల్గొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో రవాణా, రోడ్లు �read భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సుప్రీంకోర్టు ఆదేశాల అమలు, వివిధ శాఖల బాధ్యతలు, జిల్లాల మధ్య సమన్వయంపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులపై అనధికారికంగా భారీ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలపాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై ఆక్రమణల తొలగింపు, అక్రమ నిర్మాణాల నివారణ, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, పౌరుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను

రోడ్డు ప్రమాదాల నివారణకు

# సమిష్టి చర్యలు తీసుకోవాలి

- సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సమీక్ష
- సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ జులై 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** రాష్ట్రంలో రోడ్డుప్రమాదాలనుగణనీయంగా తగ్గించడం..జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం, సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలను ప్రతి జిల్లాలోసమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసుసూపరింటెండెంట్లు (ఎస్పీలు), రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలోనాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన.మార్గదర్శకాలను ప్రతి జిల్లా అధికారులు అత్యంత

ఓటర్ల డిజిటలైజేషన్

# వేగవంతం చేయాలి

**-ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**గద్వాల జూలై 21(ప్రజా జ్యోతి ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.అలాగే ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఎలక్టోరల్ రోల్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కేంద్ర ఎన్నికల సంఘం లక్ష్యమని తెలిపారు.ఇంటింటి సర్వే ద్వారా పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను

చీటింగ్ మోసాల పట్ల ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

**-నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**
**-తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మొద్దు**
**-తెలియని వ్యక్తులకు డబ్బులు, వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు**
**-మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి**



**నారాయణపేట ప్రతినిధి జూలై 21 (ప్రజా జ్యోతి)** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్, తక్షణ ఉద్యోగం,

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు తీసుకోవాలి

ప్రాధాన్యతతో అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా గతంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల వివరాలను, ప్రమాదాలకు ప్రధాన కారణాలను, అధిక ప్రమాద ప్రాంతాలు జరుగుతున్న ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) పైన సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ, ఏ కారణాలతోజరుగుతున్నాయనే అంశాలను విశ్లేషించి, వాటినివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తున్న జిల్లా రోడ్డు భద్రత కమిటీ మరింత పటిష్టంగా పనిచేసేలా చూడాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని, రోడ్ల మరమ్మతులు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ వంటి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన అన్ని మార్గదర్శకాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా అధికారులతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్ హెచ్ ఏ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలోని జాతీయ రహదారుల పరిస్థితి, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలు, హైవేలపై ఉన్న ధాబాలు, హోటళ్ల అనుమతులు, రహదారి భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, అంబులెన్స్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతకు సంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడికి సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈ వీడియోకాన్ఫరెన్సోఅదనపు కలెక్టర్ రెవిన్యూ చెన్నయ్య, ఆర్టీవో ఇమ్రాన్ అహ్మద్, ఇతర రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

ఓటర్లు సకాలంలో పూరించి సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.అనంతరం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, తహసీల్దార్లు,ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు 79.75 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని,నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గద్వాల అర్బన్‌లో కేవలం 61 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తైందని,వార్డు అధికారులు,వాలంటీర్ల సహకారంతో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపట్టాలని,వలస వెళ్లినవారు,మృతి చెందినవారు,ద్వంద్వ ఓటర్లు వంటి వివరాలను మరోసారి ధ్రువీకరించి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి,ముఖ్యమంత్రి ప్రజావాణికి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి బుధవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.భూభారతి, సాదా బైనామా తదితర దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు.రేషన్ దుకాణాలను తరచూ తనిఖీ చేస్తూ పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం సకాలంలో జారీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్,ఎన్నికల విభాగం అధికారి మంజుల,వివిధ మండలాల తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, ఞ= కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు.విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్లు, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు.ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# అక్రమ నల్ల బెల్లం పట్టివేత

**-- 6 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం**

**-- నిషేధిత నల్ల బెల్లం వ్యాపారం కొనసాగిస్తే చర్యలు**

**-- అచ్చంపేట ఎస్సై బి నరేష్**

**నాగర్ కర్నూలు జూలై 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం గ్రామంలో నిషేధిత ఆరు క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై బి నరేష్ వివరాల మేరకు ఇలా ఉన్నాయి.. లింగాటం గ్రామంలోని గాలి ముడి సుజాత ఇంట్లో నిషేధిత నల్లబెల్లం నిలువ ఉంచారని, విశ్వసనీయమైన సమాచారం మేరకు లింగోటం గ్రామంలోని గాలిమూడి సుజాత ఇంట్లో దాడులు నిర్వహించి, 20 బ్యాగుల నల్ల బెల్లం స్వాధీనం పరుచుకున్నామని.. ఒక్కొక్క బ్యాగులు 30 కేజీల చొప్పున మొత్తం ఆరు క్వింటాళ్ల నల్ల బెల్లం స్వాధీనం చేసుకోవడం జరిగిందని అచ్చంపేట ఎస్సై బి నరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి, కేసు నమోదు చేయడం జరిగింది అని ఆయన స్పష్టం చేశారు. కాగా లింగోటం తండా కు చెందిన కాట్రావత్ పవన్ కళ్యాణ్ తీసుకొని వచ్చి, గాలిమూడి సుజాత ఇంట్లో నిర్వహించారని... తద్వారా కాట్రావత్ పవన్ కుమార్, సుజాత పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎస్సై బి నరేష్ మాట్లాడుతూ... నిషేధిత నల్ల బెల్లం, పట్టణంలోని పలు కిరాణాల్లో గుట్కాలు కానీ నిషేధిత పదార్థాలు అమ్మితే అట్టి వారిపై కఠిన తరమైన చర్యలు చేపడతామని అచ్చంపేట ఎస్సై హెచ్చరించారు. అదే మాదిరిగా ఇలాంటి నిషేధిత కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ఎంతటి వారినైనను ఉపేక్షించేది లేదని ఎస్ఐ వ్యాఖ్యానించారు. ఈ తనఖీ లో అచ్చంపేట ఎస్సై బి నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

బలోపేతం చేయడం, డ్రోన్ సర్వేల ద్వారా ఆక్రమణలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

జిల్లా స్థాయిలో హైవే భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను సమర్థవంతంగా పనిచేయించడంతో పాటు పోలీసు, రవాణా శాఖ, జాతీయ రహదారుల సంస్థ, ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ రహదారులపై నిఘా, పహారా వ్యవస్థను బలోపేతం చేయడం, అత్యవసర వైద్య సేవలు, రికవరీ వాహనాలు, ట్రక్ లే-బై సౌకర్యాలు, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, తగిన లైటింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి రహదారి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో అమలు చేసి, శాఖలవారీగా అనుసరణ నివేదికలను సమర్పించాలని సమావేశంలో స్పష్టం చేశారు.

# హరేరామ హరేకృష్ణ దేవాలయం నిర్మాణానికి భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల చెక్కు అందజేత...



**నారాయణపేట ప్రతినిధి జూలై 21 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన పూరి జగన్నాథ్ స్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా రథయత్రలో భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు,పుర ప్రముఖులు,మహిళలు, భక్తులు రథయాత్రలో ఉత్సవశీగ పాల్గొన్నారు.

అనంతరం ఎస్ ఆర్ గార్డన్ లో పూరి జగన్నాథ్ స్వామి వారికి పూజ కార్యక్రమాల నిర్వహించారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మించనున్న "హరే రామ హరేకృష్ణ" దేవాలయ నిర్మాణానికి, భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ ఆర్ గార్డన్ లో ఫౌండేషన్ సభ్యులు లక్ష రూపాయల చెక్కును హరేరామ హరే కృష్ణ ఆలయ వ్యవస్థాపకులు అద్భూత్ నరసింహా దాస్ కి అందించారు.ఈ సందర్భంగా అద్భుత్ నరసింహ దాస్ మాట్లాడుతూ నారాయణపేటలో హరే రామ హరేకృష్ణ దేవాలయ నిర్మాణానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి ముందుకు వచ్చి లక్ష రూపాయల చెక్కును అందివ్వడం సంతోషం అన్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**నాగర్ కర్నూల్ : జులై 21 (ప్రజా జ్యోతి)**

బిజినపల్లి మండల పరిధిలోని గ్రామాలలో గల పాఠశాలల్లో రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులకు రావలసిన

6 డి ఏ ల బకాయిలను విడుదల చేసి పి.ఆర్.సి ని తక్షణమే ప్రకటించాలని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేయాలని ఓ పి ఎస్ ను అమలుపరచాలని కోరారు.జిపిఎఫ్, మెడికల్ రీయంబర్స్మెంట్,సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ జిల్లా ఆర్థిక కార్యదర్శి హనుమంత్ రెడ్డి బిజినపల్లి మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేఖర్ వెంకటస్వామి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

**వడ్డేపల్లి జూలై 21(ప్రజా జ్యోతి):**
జోగులాంబ గద్వాల జిల్లా మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నిరోధం,బాల్య వివాహాల నివారణ,బాలల పరిరక్షణ అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి డి.సునంద మాట్లాడుతూ,మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి పెను శాపమని,ముఖ్యంగా యువత,విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వ్యసనం వల్ల కుటుంబాలు ఆర్థిక,సామాజిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని,సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం,ఐక్యరాజ్యసమితి మాదకద్రవ్యాలు,నేరాల కార్యాలయం (యూఎన్ఓడీసీ) ప్రకటించిన "బ్రేక్ ది సైకిల్" థీమ్‌తో దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రతిజ్ఞలు,ఈ-ప్లెడ్జ్ లింక్,క్యూ ఆర్ కోడ్ ప్రచారం,విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై చైతన్యం కల్పించి,వాటికి దూరంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.బాల్య వివాహాలు చిన్నారుల జీవితాలను నాశనం చేస్తాయని,వాటి నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.ఎక్కడైనా బాలల హక్కులకు భంగం



కలిగినా,బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.అనంతరం విద్యార్థులు,అధ్యాపకులు,అధికారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని,మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీఓ నరసింహ,కళాశాల ప్రిన్సిపాల్ రామ ఓబులేష్,వైస్ ప్రిన్సిపాల్ సంపత్,సోషల్ వర్కర్ పద్మ,సూపర్వైజర్ నవీన్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా యాంకి పోలమ్మ బోనాల ఉత్సవాలు



**నర్వ జులై 21 ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని యాంకి పోలమ్మ దేవాలయం వద్ద బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మండలంలోని లంకాల, యాముకి, లక్కడిదొడ్డి, గ్రామాల లలో. మంగళవారం పోలమ్మ బోనాల పండుగను. ఆయా గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు,. ఈ సందర్భంగా కురుమ యాదవులు బోనం. ఎత్తుకొని యాంకి చెరువు కట్ట వద్ద వెలసిన పోల. పోలమ్మ పోచమ్మ దేవాలయం వద్దకు భారీ ఎత్తున జనాలు బోనంకుండలతో నైవేద్యాలను తీసుకువెళ్లి అమ్మవారి మొక్కలను తీర్చుకున్నారు, మూడు గ్రామాలలో ఒకే రోజు పండుగను జరుపుకోవడం వలన అధిక సంఖ్యలో జనాలు రావడం జరిగింది జనాలకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నరువ ఎస్సై రమేష్ బందోబస్తు నిర్వహించి సహకరించడం జరిగింది, అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు లేకుండా పండుగను జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్య హత్యే

**-- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్**



**మహబూబ్‌నగర్, జూలై 21( ప్రజా జ్యోతి బ్యూరో ):**
పార్లమెంట్ సమీపంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని ఏఐఎస్ఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా సమితి తీవ్రంగా ఖండించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రాజు ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన శాంతియుత నిరసనపై బలప్రయోగం చేయడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రశ్నించే ప్రతి గొంతును లాఠీలతో అణచివేయాలనే ప్రయత్నాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వాటిని వినకుండా పోలీసులతో దాడులు చేయించడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఈ ఘటనకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జికి ఆదేశాలు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులను శత్రువులుగా చూడకుండా, వారి సమస్యలను అణచివేతతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులపై దాడులు కొనసాగితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, అవసరమైతే దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు ధర్మతేజ, అరుణ్, వంశీ, అర్జున్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలింప చేయాలి



**నర్వా జూలై 21 ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని టీఆర్ఎస్ మండల నాయకులు దండు అయ్యప్ప స్వగృహం వద్ద మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మంగళవారం సాయంత్రం టీ బ్రేక్ చేశారు, ఈ సందర్భంగా అక్కడ ఓటరు జాబితాలను తెప్పించుకుని చూసి ప్రస్తుతం గ్రామాలలో జరుగుతున్న సర్ కార్య గ్రామంలో భాగంగా టీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామాలలో బి ఎల్ ఓ ల వెంబడ ఉండి ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి డబల్ ఓట్లు రాకుండా చూసుకోవాలని టీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు, ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, దండు అయ్యప్ప, రాజారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పాతర చెడు మహేష్, కావలి కృష్ణ, బుజ్జన్న, అశోక్, తదితరులు పాల్గొన్నారు

# జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**మహబూబ్‌నగర్, జూలై 21( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు, ఉద్యోగ నిర్వహణ వివరాలను సమీక్షించారు.
క్షయవ్యాధి దగ్గు, తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందని పేర్కొన్న ఆయన, వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించి, పూర్తిస్థాయిలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు.
క్షయవ్యాధి ఒక కుటుంబం జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, సరైన చికిత్స తీసుకోకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం వల్ల ఇతరులకు వ్యాధి వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామస్థాయి వరకు క్షయ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ వ్యాధి నివారణ, పూర్తి చికిత్స, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.
అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా-శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రసవానంతర సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కోసం అవసరమైన సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత వైద్యాధికారి డా. రాఘవేందర్‌కు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. మల్లికార్జున్, లెప్రసీ ఉ ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి డా. రాజు, డా. పీస్ ప్రీతీ, డా. రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, ఎంపీహెచ్ఈఓ సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లు, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
**- డీఎస్పీ వెంకటేశ్వర్లు**

**మహబూబ్‌నగర్, జూలై 21( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా ఎస్పీ దరా వత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు మోడిఫైడ్ సైలెన్సర్లు, మైనర్ల డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో మోడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి సంబంధిత వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.
అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మోడిఫైడ్ సైలెన్సర్ల వల్ల శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని, ఇటువంటి వాహనాలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచిస్తూ, ప్రతి వాహనానికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ మానవాళి సుఖశాంతుల కోసం విశ్వశాంతి మహాయాగం

## యాగ ఫలంతో సమృద్ధిగా వర్షాలు రైతులందరూ సుఖిక్షంగా జీవించాలి: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

**కల్వకుర్తి, జులై 21 (ప్రజా జ్యోతి ):**

ప్రపంచ మానవాళి సుఖశాంతులు, దేశ ప్రజల ఆరోగ్యం, రైతాంగ సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ విశ్వశాంతి మహాయాగం ఎంతో పవిత్రమైనధని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాభావంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉశీ దన్నారు. ఈ యాగ ఫలంతో ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలి. ప్రతి చెరువు నిండాలి, ప్రతి పొలం పచ్చగా కళకళలాడాలి, ప్రతి రైతు కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని శ్రీనివాస్ రెడ్డి దైవాన్ని వేడుకున్నారు.రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. భారతీయ సంస్కృతి ప్రపంచానికి శాంతి, సామరస్యాన్ని బోధించింది. అలాంటి గొప్ప సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాయాగం విజయవంతం కావాలని, ప్రపంచ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం కల్వకుర్తిలో జరుగుతున్న అయుత చండీయాగంలో ఆయన పాల్గొన్నారు. కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిత్య స్వరూపానంద స్వామి

ప్రపంచ మానవాళి సుఖశాంతులు, దేశంలో సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా జీవించాలని సంకల్పంతో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్ర 91వ విశ్వశాంతి మహాయాగం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆయుత చండీ -- అతిరుద్ర మహాయాగం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం యాగశాలను సందర్శించి వేదపండితుల నుంచి ఆశీర్వాదం పొందారు.

**వర్షాభావం తొలగి రైతు ముఖంలో చిరునవ్వు వెల్లివిరియాలి**

ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డిఅన్నారు. ప్రస్తుతం రాష్ట్రంతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్రంగా కలవరపెడుతున్నాయని అన్నారు. రైతు పండించిన పంట దేశానికి అన్నం పెడుతుందని, అలాంటి రైతు ఇబ్బందుల్లో ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రతి రైతు కుటుంబంలో సంతోషం, ప్రతి ఇంటిలో సిరిసంపదలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆయన అన్నారు.

ప్రపంచ శాంతికి భారతీయ సంస్కృతి దిక్సూచి

భారతీయ సనాతన ధర్మంలో యాగాలు, యజ్ఞాలకు విశిష్ట స్థానం ఉందని గోలి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ శాంతి, ప్రకృతి సమతుల్యత, మానవాళి సంక్షేమం కోసం నిర్వహించే ఇటువంటి మహాయాగాలు సమాజానికి సానుకూల శక్తిని అందిస్తాయని పేర్కొన్నారు. మత, కుల భేదాలకు అతీతంగా ప్రజలంతా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని శాంతి, సామరస్యాల కోసం ప్రార్థించడం అభినందనీయమని అన్నారు.

**ఆగస్టు 3 వరకు యాగాలు**

ఈ సందర్భంగా శ్రీశ్రీ కృష్ణ చైతన్య పరిశుద్ధానంద స్వామి మాట్లాడుతూ





విశ్వశాంతి, లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ మహాయాగం ఫలితం ప్రపంచ ప్రజలందరికీ అందుతుందని తెలిపారు. ఆగస్టు 3 వరకు వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

**అంగరంగ వైభవంగా యాగ మహోత్సవం**

యాగ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా కొనసాగింది. మంగళవారం శ్రీ ఆంజనేయ మన్యు పాశుపత హోమం, చండీ హోమం, నవగ్రహ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అభయాంజనేయ స్వామివారికి లక్ష తమలపాకుల అర్చన, సింధూర అర్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణాలు భక్తిశ్రద్ధలతో సాగగా, రాత్రి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది.

సుమారు 1,500 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. మహిళలు, యువత, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగ కార్యక్రమాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, జూలూరి ప్రకాష్, బీచని బాలకృష్ణ, పోలా సురేందర్, మదన మురళి,జూలూరు ప్రకాష్, రాజేందర్, కల్మిచర్ల గోపాల్, రాఘువేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వట్టెపు బాలయ్య,సింగం విజయ్ గౌడ్,మాజీ ఎంపీపీ పుట్ట రామిరెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు నాగులు నాయక్, మార్చాలసర్పంచ్ కృష్ణ రెడ్డి,వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి,నాయకులు కిషోర్,పాండు,నరేష్,రమేష్,ప్రవీణ్, గణేష్,బాలరాజ్,తిరుపతి రెడ్డి,శంకర్,అశోక్,వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వేదపండితులు, మహిళా భక్తులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కార్యకర్తకు నేనున్నాననే భరోసా.

## అధైర్య పడొద్దు అండగా నేనుంటా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, జులై 21 (ప్రజా జ్యోతి):**

నియోజకవర్గంలో కార్యకర్తలకు ఆపద సమయంలో నేనున్నానని అభయహస్తం గోలి శ్రీనివాస్ రెడ్డి... ఆపద కాలంలో అధైర్య పడకండి అండగా నేనుంటానని హామీ ఇచ్చారు. మంగళవారశీకల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భూషపాకుల రామకృష్ణ ఇటీవల శాస్త్ర చికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి రామకృష్ణను పరామర్శించారు..ఈ సందర్భంగా ఆయన రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు.

అవసరమైన ప్రతి విషయంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఆయన వెంట , మాజి మార్కట కమిటి చైర్మన్లు వట్టపు బాలయ్య,సింగం విజయ్ గౌడ్,మాజి ఎంపీపీ పుట్ట రామిరెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు నాగులు నాయక్, మార్చర్ల సర్పంచ్ కృష్ణ రెడ్డి,వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి,నాయకులు కిషోర్,పాండు,నరేష్,రమేష్,ప్రవీణ్, గణేష్,బాలరాజ్,తిరుపతి రెడ్డి,శంకర్,అశోక్,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు



## సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా పలుస రామన్ గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక.



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజు నిర్వహించిన సర్పంచ్ల సంఘం సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల అధ్యక్షుడిగా పలుస రామన్ గౌడ్ ఉపాధ్యక్షుడిగా బాలరాజు ప్రధాన కార్యదర్శిగా దొడ్ల కవిత కోశాధికారిగా గోపీనాయక్ ప్రచార కార్యదర్శిగా రాముడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు పలస రామన్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సర్పంచుల అందరితో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధుల సాధన తో పాటు సర్పంచ్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు సర్పంచుల ఐక్యతే గ్రామ అభివృద్ధికి బలమని అందరి సహకారంతో మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు స్థానిక ఎస్సై జె నరేష్ మండల అధికారులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు నూతన కమిటీ సభ్యులను అభినందనలు తెలియజేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు సమావేశంలో మండలంలోని పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

## ఆంగ్ల మాధ్యమం అందరి కోరిక



**కృష్ణా జులై 21 (ప్రజా జ్యోతి)**

ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం బోధించాలి అని వినతి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పిల్లలు ప్రపంచానికి దిక్సూచిగా మారాలని కున్సి గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. అంగన్ వాడీ, 1, 2, 3వ తరగతులకు ఈ ఏడాది నుండే విద్యార్థులకు ఆంగ్లంలో పాఠాలు బోధించాలని, యం పి పి ఎస్ ప్రధానోపాధ్యాయులు నరసింహ గారికి సర్పంచ్ మ్యాకలి సురేష్ తో కలిసి గ్రామ ప్రజలు వినతి పత్రం అందించారు. వచ్చే ఏడాది ఒక్కొక తరగతి పెంచుతూ.. రెండేళ్ళలో యం పి పి ఎస్ పాఠశాల తరగతులలో ఆంగ్లంతో కూడిన విద్యా బోధన జరగాలని వారు కోరారు. భవిష్యత్తులో కున్సి గ్రామ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచస్థాయి జ్ఞానాన్ని సులభంగా అర్థం చేసుకుని మెరుగైన జీవన విధానాన్ని సృష్టించాలని తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నాగర్ కర్నూల్ జులై 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బిజినపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో గల పాఠశాలల్లో...రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రమేష్ వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన 6 డి ఏ ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పి. ఆర్. సి ని తక్షణమే ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేయాలని ఓ పి ఎస్ ను అమలుపరచాలని కోరారు . జిపిఎఫ్, మెడికల్ రీయంబర్స్మెంట్, సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి హనుమంత్ రెడ్డి బిజినపల్లి మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేఖర్ వెంకటస్వామి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలి

### షి టీమ్ పోలీసులు

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు

**నారాయణపేట ప్రతినిధి జూలై 21 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట మండలం, బైరం కొండ గ్రామంలోని స్కూల్లో షి టీమ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాల్యవివాహాలు, సెల్ఫోన్ అధిక వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు చెనప్ప మాట్లాడుతూ... ఇంటి నుండి పాఠశాలకు పాఠశాల నుండి ఇంటికి వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తుల నుండి విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మరియు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మాట్లాడిన లేదా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేసిన అమ్మాయిలతో ఫోటోలు దిగి మోసం చేసిన లేదా ఎప్పుడో దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి వేరే వ్యక్తులకు షేర్ చేస్తానని బెదిరించిన బ్లాక్ మెయిల్ చేసిన ఇబ్బందులకు గురి చేసిన వారి వెంటపడిన, వేదించి సతాయించిన వెంటనే షి టీం నెంబర్ 8712670398 కాల్ చేయాలని మీ పేరు డీటెయిల్స్ వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అలాంటి పనులు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఆకతాయిలు ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే జిల్లా షీ టీం కి ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ మోసాలకు గురై బాధితులు డబ్బు రూపకంగా నష్టపోయిన యెడల వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయాలని మరియు ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు అధికమయ్యాయని





ప్రజలు జాగ్రత్తగా ఉంటూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి ఇరుగుపొరుగు వారికి సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు బాలరాజు, జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏవో పర్యవేక్షణ ఎక్కడ..?

### రైతుల ప్రశ్నలతో వ్యవసాయ శాఖపై విమర్శలు

### 200 డీఏపీ బస్తాల పట్టివేత.. రైతుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

### మండలంలో ఎరువుల అక్రమాలపై తీవ్ర అనుమానాలు..

### నమూనాలు ల్యాబ్‌కు పంపిన అధికారులు

**చిన్నంబావి, జూలై 21 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలుగుచూసిన అనుమానాస్పద డీఏపీ ఎరువుల వ్యవహారం మండలవ్యాప్తంగా కలకలం రేపుతోంది. రైతుల అప్రమత్తతతో డీసీఎం వాహనం (టూ 05 ఖజు 6751)లో తరలిస్తున్న సుమారు 200 డీఏపీ బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.రైతుల కథనం ప్రకారం గద్వాల--కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి తీసుకొచ్చిన ఈ డీఏపీ నాణ్యతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళనతో రైతులే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని వ్యవసాయ శాఖ ఏడీ తెలిపారు.అయితే ఈ ఘటనతో మండలంలో వ్యవసాయ శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో





అనుమానాస్పద ఎరువులు మండలంలోకి ఎలా చేరాయి? ఎవరి అండతో సరఫరా జరుగుతోంది? వ్యవసాయ శాఖ పర్యవేక్షణ ఎక్కడ? అనే ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.మండల వ్యవసాయ అధికారి (ఏవో) డాకేశ్వర్ గౌడ్ స్పందనపై కూడా రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులు, విలేకర్లు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ఎరువుల దుకాణాల తనిఖీలు, లైసెన్సుల పరిశీలన, ధరల నియంత్రణ వంటి అంశాల్లో సరైన పర్యవేక్షణ లేదని విమర్శిస్తున్నారు.వ్యవసాయ సీజన్‌లో రైతులు నాణ్యమైన ఎరువుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇలాంటి ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఒక డీఏపీ బస్తా రూ.1,550కు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒకవేళ నాసిరకం లేదా నకిలీ ఎరువుల సరఫరా జరిగితే వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనుమానాస్పద డీఏపీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, పరీక్షల్లో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది:

### ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి

**నారాయణపేట ప్రతినిధి జూలై 21 (ప్రజా జ్యోతి)**

ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి మరియు మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని జాజాపూర్ రైతు వేదికలో నేడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఓ జిల్లా మత్స్య శాఖ సహకార సంఘం అధ్యక్షులు కాంతు కుమార్ ముదిరాజ్ నారాయణపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నారాయణపేట పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, దరఖాస్తు ప్రక్రియ, అర్హతలు మరియు అవసరమైన ధ్రువపత్రాలపై ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం తమ కుమార్తెల వివాహానికి ఎంతో తోడ్పడుతుందని లబ్ధిదారులు పేర్కొన్నారు.



## రామ్‌కి పోలమ్మ బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**నర్వ జులై 21 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండలం యాంకి పోలమ్మ బోనాల పండుగ ఉత్సవాలలో మంగళవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు, ఈ సందర్భంగా యాంకి లంకల లక్కరి దొడ్డి గ్రామాల నుండి వచ్చిన గ్రామస్తులతో మాట్లాడారు ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి నాయకులు లక్ష్మణ్ దండు అయ్యప్ప, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## అదుపు తప్పిన మున్సిపాలిటీ వాహనం

### --చిన్నారితో సహా ఇద్దరికి తీవ్ర గాయాలు

**నాగర్ కర్నూల్ : జులై 21 (ప్రజా జ్యోతి)**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం మున్సిపాలిటీ వాహనం అదుపు తప్పి,ఎదురుగా వస్తున్న స్కూటీని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఓ చిన్నారితో పాటుమరొకరికి తీవ్ర గాయాలకాగా,బాలుడి ముఖం మరియు కంటి సమీపంలో తీవ్ర రక్తస్రావమైంది.గాయపడిన ఇద్దరినీ స్థానికులు,కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదానికికారణమైన నాగర్ కర్నూల్ పురపాలక సంఘం వాహనం నంబర్ టూ 08 ఖ+ 4272 మున్సిపల్‌వాహనం ముందుభాగం నుజ్జుయ్యింది.పట్టణంలో మున్సిపల్ వాహనాల డ్రైవర్లు అపరిమిత వేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడుపుతున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మృతుని అంత్యక్రియలకు రూ.8వేల ఆర్థిక సాయం

**చిన్నంబావి, జూన్ 21 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం, పెద్ద మారూర్ కు చెందిన గడ్డం శివుడు (40) పురుగుల మందు సేవించి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ బిళ్లకంటి విద్యాసాగర్ రావు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, అంత్యక్రియల నిమిత్తం రూ.8 వేల ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం గ్రామ సర్పంచి కేతపాగ జయమ్మ లక్ష్మయ్య ద్వారా ఈ డబ్బులను పంపించారు.ఈ మొత్తాన్ని గ్రామ సర్పంచ్ కేతపాగ జయమ్మ, కే. లక్ష్మయ్యల ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం సర్పంచ్ కేతపాగ జయమ్మ, ఉప సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చి, అంత్యక్రియల నిమిత్తం రూ.8 వేల ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చుక్కారావు హనుమంతరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాసులు, కే. లక్ష్మయ్య, వార్డు సభ్యుడు అన్నలదాసి పురంధర్ నాయుడు, మాజీ వార్డు సభ్యుడు గడ్డం నరహరి, గడ్డం నరసింహ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ ఫ్రీ అమ్రాబాద్ ప్రోగ్రాం

## - మద్దతుగా అప్పాపూర్ గిరిజన విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ




**నాగర్ కర్నూల్ జులై 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అమలు చేస్తున్న "ప్లాస్టిక్ ఫ్రీ అమ్రాబాద్" కార్యక్రమానికి మద్దతుగా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ వాలంటీర్ కిరణ్ ఆధ్వర్యంలో లింగాల మండలంలోని అప్పాపూర్ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు 140 స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ 2024 సంవత్సరం నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో "ప్లాస్టిక్ ఫ్రీ అమ్రాబాద్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పర్యావరణ బాధ్యతను పెంపొందించేందుకు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల వన్యప్రాణులు, అడవులు మరియు పర్యావరణానికి కలిగే హాని గురించి అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాలు ప్రకృతి సంరక్షణలో..భాగస్వాములు కావాలంటే పర్యావరణహిత అలవాట్లు చిన్ననాటి నుంచే అలవరచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా పునర్వినియోగపరచదగిన స్టీల్ బాటిల్ లను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లమల ల్యాండ్‌స్కేప్ కోఆర్డినేటర్ బాపురెడ్డి, అఖిల్ గౌడ్, ఇమ్మాన్యుయేల్, ప్రేమ్ కుమార్, అటవీ శాఖ బీట్ అధికారులు మాధవరెడ్డి, సురేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

## -100 శాతం ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపు
## - పూర్తి చేసిన బూత్‌ల బీఎల్ఏలకు సన్మానం



**అడ్డాకుల, జూలై 21 (ప్రజాజ్యోతి):**

అడ్డాకుల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్షా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీఎల్ఓలు, బీఎల్ఏలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసిన బూత్‌లకు చెందిన బీఎల్ఏలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగించేలా బీఎల్ఏలు కృషి చేయాలని సూచించారు. సందేహాస్పద ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారిక గడువు ఆగస్టు 3 వరకు ఉన్నప్పటికీ జూలై 25నే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి బూత్‌లో 100 శాతం ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. బీఎల్ఏలు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రాజకీయ అంశాలపై స్పందిస్తూ, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర నియోజకవర్గంలో 50 వేల మెజార్టీతో విజయం సాధించి రెండోసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని, 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, గ్రామ సర్పంచులు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర ఆటో చోరుడికి టూ టౌన్ పోలీసుల చెక్..

## చోరీ ఆటో స్వాధీనం -- 16 కేసుల నిందితుడు అరెస్ట్

**మహబూబ్‌నగర్, జూలై 21( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీసులు అంతర్రాష్ట్ర స్థాయిలో ఆస్తి నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీకి గురైన ఆటో రిక్షాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 16 ఆస్తి నేరాల కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 2న మహబూబ్‌నగర్ పట్టణంలో ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో రిక్షా చోరీకి గురికావడంతో బాధితుడు మూడావత్ రవి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఎర్ర సత్యం చౌరస్తా వద్ద నిందితుడు సంచరిస్తున్నట్లు సాంకేతిక సమాచారంతో గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు రంగారెడ్డి జిల్లా యాదవ మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ (24)గా గుర్తించారు. విచారణలో టూ టౌన్ పరిధిలో జరిగిన ఆటో చోరీకి తానే పాల్పడినట్లు అంగీకరించాడు.

నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన ఆటో రిక్షాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో అతనిపై హైదరాబాద్, చిత్తూరు, అనంతపురం, కడప, ఆదోని తదితర ప్రాంతాల్లో చోరీ, మోసం, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ తదితర ఆస్తి నేరాలకు సంబంధించిన మొత్తం 16 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా పార్క్ చేసిన ఆటోలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మరిన్ని కేసులపై కూడా విచారణ కొనసాగుతోంది. కేసును ఛేదించిన ఎస్ఐ శివనాగేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుళ్లు అశోక్, కూర్మూర్తి, ఐటీ కోర్ సిబ్బంది ప్రవీణ్‌లను జిల్లా ఎస్పీ జానకి అభినందించారు.

ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయడంతో పాటు స్టీరింగ్ లాక్, వీల్ లాక్ వంటి భద్రతా పరికరాలు వినియోగించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజుద్దీన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివనగేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.



# మానవ మనుగడకు మొక్కలే ఆధారం: ఎంపీవో, ఏపీఓ



**చిన్నంబావి, జూలై 21 ( ప్రజా జ్యోతి)**

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మండల అధికారులు పిలుపునిచ్చారు. చిన్నంబావి మండలంలోని గూడెం గ్రామంలో సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో రామస్వామి, ఏపీఓ ధనుంజయ రాజు, టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్ యాదవ్ మొక్కలు నాటి ప్రజలకు అవగాహన కల్పించారు."ప్రకృతిని కాపాడితేనే ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అని పేర్కొంటూ ప్రతి వ్యక్తి ఏటా కనీసం రెండు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. చెట్లు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడతాయని, ఫలాలు, నీడతో పాటు జీవవైవిధ్యానికి ఆధారంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విక్రమ్ యాదవ్, గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటి హరితహారం విజయవంతం చేశారు.

## రేషన్ దుకాణాలు, రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు



**మల్దకల్ జూలై 21(ప్రజా జ్యోతి):**

మల్దకల్ మండల కేంద్రం లోని రేషన్ దుకా ణాలు,రైస మిల్లుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ప్రశా ంత్ గౌడ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు.మండల కేంద్రంలోని మూడు రేషన్ దుకాణాలను పరిశీలించిన ఆయన,రిజిస్టర్లు,ఈ-పాస్ యంత్రాలు,నిల్వల (స్టాక్) వివరాలను తనిఖీ చేసి సంబంధిత డీలర్లను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రభుత్వానికి సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం నిల్వలను మండల కేంద్రంలోని రైస్‌మిల్లుల్లో పరిశీలించారు. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా తరలించడం లేదా దుర్వినియోగం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## పిచ్చి మొక్కల తొలగింపుతో కాలనీవాసులకు ఊరట

### - వార్డు సమస్యల పరిష్కారంలో 22వ వార్డు కౌన్సిలర్ చొరవ

**వనపర్తి, జూలై 21 (ప్రజాజ్యోతి):**

వనపర్తి జిల్లా కేంద్రంలోని 22వ వార్డు ఉప్పరి లచ్చన్న కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం కారణంగా పాముల సంచారం ఎక్కువై కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ, మెకానిక్ శ్రీను దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి జేసీబీతో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించే చర్యలు చేపట్టించారు. దీంతో కాలనీలో పరిశుభ్రత నెలకొనడంతో పాటు పాముల బెడద నుంచి ఉపశమనం లభించిందని స్థానికులు తెలిపారు. వార్డు సమస్యలపై వెంటనే స్పందించినందుకు వారికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



# తెలంగాణ కీర్తి పతాకాన్ని ఆసియా వేదికపైరెపరెపలాడించిన
# సాయి ప్రవల్లికకు ఘన సన్మానం..!

**కల్వకుర్తి జూలై 21 ( ప్రజా జ్యోతి )**

– ఆసియాలో తొలిసారిగా నిర్వహించిన అండర్-23 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్-2026లో మహిళల 4ఐ400 మీటర్ల రిలే విభాగంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి సాయి ప్రవల్లికను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు కాయితి ఆశాదీప్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సాయి ప్రవల్లిక విజయం ప్రతి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావచ్చని ఆమె నిరూపించారని ఆయన కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి ఒలింపిక్స్‌లో పతకం అందించాలనే లక్ష్యంతో శ్రమిస్తున్న సాయి ప్రవల్లికకు ప్రోత్సాహకంగా 2028 ఒలింపిక్స్ శిక్షణ కోసం తన వంతు సహాయంగా రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాయితి ఆశాదీపురెడ్డి అందజేశారు. ఈ సహాయం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, తెలంగాణ యువత



ప్రతిభపై తమకున్న విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని, ప్రతిభను గుర్తించి అండగా నిలిస్తే దేశానికి మరిన్ని పతకాలు తీసుకురాగలరని కాయితి ఆశాదీప్ రెడ్డి అన్నారు. రాబోయే 2028 ఒలింపిక్స్లో కూడా సాయి ప్రవల్లిక భారత త్రివర్ణ పతాకాన్ని ప్రపంచ వేదికపై మరింత ఎత్తుకు ఎగురవేసి దేశానికి కీర్తి తీసుకురావాలని, ఆమె విజయ ప్రస్థానం మరెందరో యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు.

# అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయింపులో పార్టీ వివక్షత వద్ద
# కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాతం మానుకోవాలి

**గండీడ్, జూలై 21 (ప్రజాజ్యోతి):**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన పేదలను విస్మరించి, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ గండీడ్ మండల నాయకులు మంగళవారం ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా ఉన్నందున అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పార్టీలు, కులాలు, మతాలు అనే తేడా లేకుండా అందరికీ అమలు చేస్తున్న తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. అధికారులే గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను ఖరారు చేయాలని, రాజకీయ ఒత్తిళ్లు లేదా పార్టీ సిఫారసులకు తావు ఇవ్వకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుల సిఫారసుల మేరకు అర్హత లేని వారికి ఇళ్లు కేటాయించి, నిజమైన పేదలను పక్కన పెడితే బీజేపీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల హక్కులను కాలరాస్తూ సంక్షేమ



పథకాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం తగదని, ప్రతి అర్హుడికి ఇల్లు అందే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. అధికారులకు సమర్పించిన వినతిపత్రంపై తక్షణ చర్యలు తీసుకుని అర్హులైన పేదలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి మల్కయ్య, ఉపాధ్యక్షులు వెంకటేష్, భద్రేశ్వర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

### మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజా జ్యోతి -- గండీడ్

గండీడ్ మండల పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 21, 2026న ఉదయం సుమారు 7:15 గంటలకు కపులాపూర్ గ్రామానికి చెందిన మాలికాడి బుగ్గమ్మ, అశోక్ ద్విచక్ర వాహనంపై కోసిగి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో గొల్లగడ్డ గేటు సమీపంలో వారి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు (రిజిస్ట్రేషన్ నం. ౧+ 38 ౧ 1707) ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలో మాలికాడి బుగ్గమ్మ గాయాలకు తాళలేక మృతి చెందింది. అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్దూరు మండలం దోరేపల్లి గ్రామానికి చెందిన ఇరారం శ్రీనుగా పోలీసులు గుర్తించారు. మృతురాలి మేనల్లుడు మాలికాడి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఈ విషాద ఘటనతో కపులాపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు రోడ్లపై వేగ నియంత్రణ చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను కోరుతున్నారు.

## ఒకే కాన్పులో ముగ్గురు జననం

**-ప్రగతి నర్సింగ్ హోమ్ లో సాధారణ కాన్పు**
**-ఇద్దరు మగ పిల్లలు ఒక ఆడ పిల్ల జననం**
**-ముగ్గురు పిల్లలు ఆరోగ్యాంగా ఉన్నారు -డాక్టర్.నూర్జహాన్**

**నాగర్ కర్నూల్ :: జులై 21 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రగతి నర్సింగ్ హోమ్ ఆస్పత్రిలో మహిళకు మంగళవారం ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించినట్లు డా.నూర్జహాన్ తెలిపారు. పెద్ద కొత్తపల్లి మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన 22 సంవత్సరాల అనిత అనే మహిళ మొదటి కానుపు కోసం సోమవారం ఆస్పత్రికి వచ్చిందని నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించగా సాధారణ ప్రసవంలో ఇద్దరు మగ పిల్లలు ఓ ఆడపిల్లకు జన్మనిచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. 40 సంవత్సరాల ప్రాక్టీస్లో ముగ్గురు పిల్లలు జన్మించడం ఐదవసారని డాక్టర్ నూర్జహాన్ తెలిపారు. ముగ్గురు పిల్లల బరువు రెండు కిలోల చొప్పున ఉన్నారని ముగ్గురు కూడా ఆరోగ్యంగా ఉన్నారని సాధారణ కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు



## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు



ప్రజా జ్యోతి -- గండీడ్

గండీడ్ మండలంలోని పెద్దవార్వల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎల్‌నినో ప్రభావంపై రైతులకు వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జంగం వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈఓ ప్రీతి సుధా రైతులకు ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా దిగుబడులను మెరుగుపరుచుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అడ్డాకులలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పర్యటన

**అడ్డాకుల, జూలై 21 (ప్రజాజ్యోతి):**



దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అడ్డాకుల మండల కేంద్రానికి రానున్నట్లు మండల అధ్యక్షులు తోట శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంలోని మాంగల్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశంలో బూత్‌ల వారీగా జరిగిన పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి బూత్‌కు సంబంధించిన శాతం వివరాలను సిద్ధం చేసుకుని నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమీక్షా సమావేశానికి పార్టీ నాయకులు, బూత్ ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌కు వేగం పెంచాలి

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జూలై 21 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, రాష్ట్రంలో వెనుకబడి ఉన్న జిల్లాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించిన అనంతరం, వారంలోగా అన్ని జిల్లాలు కనీసం 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని, వీలైనంత త్వరగా మొత్తం ప్రక్రియను ముగించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్ నమోదు ఐచ్ఛికం మాత్రమేనని, అది తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. అలాగే, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు జిల్లా కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

